సాక్షి
జనగామ
శుక్రవారం । 16 । ఆగస్టు । 2024



ప్రాణాపాయం నుంచి..

కారు డోర్‌లాక్ కావడంతో అందులో చిక్కుకు పోయిన ఇద్దరు చిన్నారులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. - 8లో▸



'ఇంటి భోజనానికి' గుర్తింపు

వరంగల్ జిల్లా నర్సంపేటలోని ఉప్పలయ్య హోటల్ 'ఇంటి భోజనానికి' జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
35^0/25^0

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి.

సొంతింటి కల సాకారం..

- నియోజకవర్గానికి 3,500 ఇళ్లు
- మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్ద పీట
- మహాలక్ష్మి పథకంతో రూ.500కే సిలిండర్
- గృహజ్యోతి పథకంలో 87వేల కుటుంబాలకు లబ్ధి
- ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య
- ధర్మకంచ మినీ స్టేడియంలో వంద్రాగస్టు వేడుకలు

జనగామ: గూడు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ పథకంతో సొంతింటి కల సాకారం కాబోతోందని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన.. జాతీయ జెండా ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో పేదలకు 3,500 ఇళ్లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం కింద జిల్లాలో 87వేల కుటుంబాలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అమలవుతోందని, ఇప్పటి వరకు 4.69లక్షల యూనిట్లకు రూ.13.47 కోట్ల సబ్సిడీ చెల్లించినట్లు తెలిపారు. మహాలక్ష్మి స్కీం ద్వారా రూ.500 కే గ్యాస్ సిలిండర్ 78వేల కుటుంబాలకు అందుతోందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ.2లక్షల వరకు పంట రుణమాఫీ అమలు చేస్తున్నారని, జిల్లాలో రెండు విడతల్లో 43,700 మంది రైతులకు రూ.330.34 కోట్ల రుణం జమ చేసినట్లు వివరించారు. వానాకాలం సీజన్‌లో ఎరువులు, విత్తనాల కొరత లేకుండా ప్రత్యేక చొరవ చూపిన సర్కారు ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించేందుకు 770 మంది రైతులకు రూ.4.13 కోట్ల రాయితీ ఇచ్చిందన్నారు. 2023–24 వానాకాలం సీసీఐ ద్వారా 30వేల మంది రైతుల నుంచి రూ.534 కోట్ల విలువైన 7.67లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసిందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తోందని విప్ అయిలయ్య అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందని, దీంతో జిల్లాలో గడిచిన 8 నెలల్లో 2,908 మంది పేదలు లబ్ధిపొందారని చెప్పారు. 536 ప్రభుత్వ పాఠశాలల్లో 'అమ్మ ఆదర్శ కమిటీ'లు ఏర్పాటు చేసి 291 స్కూళ్లలో రూ.9.38కోట్లతో అభివృద్ధి పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. కుల, చేతి వృత్తులపై ఆధారపడిన బీసీ కుటుంబాలకు రూ.లక్ష ఆర్థిక సాయం కింద 8,798 మంది దరఖాస్తు చేసుకోగా 563 మందికి మంజూరు అయిందన్నారు. జిల్లా కేంద్రంలో రూ.190 కోట్లతో చేపట్టిన మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు 20 శాతం పూర్తయినట్లు చెప్పారు. ఈ ఏడాది వనమహోత్సవంలో 26లక్షల మొక్కల లక్ష్యానికి 24లక్షలు నాటినట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధికి ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మీ–సేవా కేంద్రాలు, క్యాంటీన్లు, సోలార్ ప్లాంట్లు, ఫుడ్ ప్రాసెసింగ్, చేపల ప్రాసెసింగ్, మొబైల్ యూనిట్ల ఏర్పాటు గ్రౌండింగ్ పనులు చురుకుగా సాగుతున్నాయని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం 9,278 సంఘాలకు రూ.139 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. జనగామ మున్సిపల్ పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యాన ఉపాధి అవకాశాలకు రుణాలు ఇస్తున్నామని చెప్పారు. జిల్లాలో టూరిజం అభివృద్ధికి రూ.25కోట్ల బడ్జెట్‌తో పాలకుర్తి, వల్మిడి, జఫర్‌గఢ్, బొమ్మెర ప్రాంతాలకు పూర్వ వైభవం తెస్తామన్నారు. డ్రగ్ రహిత జిల్లాగా మార్చేందుకు 2019 నుంచి 2023 వరకు 5 కేసులు నమోదు చేసి 148 కిలోల గంజాయి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. టీఎస్ ఐపాస్ ద్వారా 2023–24లో 93, 2024–25లో 28 పరిశ్రమలకు అనుమతి ఇచ్చామని, జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, డీసీపీ రాజమహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



వేదికపై కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు పికేశ్‌కుమార్, రోహిత్ సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్ తదితరులు





మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న విప్ అయిలయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

రూ.25 కోట్ల రుణం పంపిణీ

188 స్వయం సహాయ సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన రూ.25కోట్ల రుణ చెక్కును విప్ అందజేశారు. అలాగే స్త్రీ నిధి ద్వారా రూ.2కోట్లు, మున్సిపల్ పరిధి సంఘాలకు మెప్మా ద్వారా రూ.7.36 కోట్ల చెక్కు పంపిణీ చేశారు.





పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న విప్ అయిలయ్య, పక్కన కలెక్టర్



స్వాతంత్ర్య వేడుకల్లో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు



విద్యార్థుల ప్రదర్శన



నృత్యం చేస్తున్న చిన్నారులు

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే కడియం.. వైఖరి మార్చుకోవాలి



స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి వ్యక్తిగత స్వార్థం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం శ్రీహరి వైఖరి మారుతోంది.. 1994లో మాదిరిగా అక్రమ అరెస్టులు, బెదిరింపులకు తెర తీస్తున్నారు.. తన వైఖరిని మార్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. పంద్రాగస్టు సందర్భంగా గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గడిచిన 8 నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ, కడియం శ్రీహరి నియోజకవర్గంలో చేసిందేమి లేదన్నారు. మీ గెలుపు కోసం అందరూ కష్టపడి పనిచేశారన్న విషయం గుర్తుంచుకొని నియోజకవర్గంలో అందరినీ సమానంగా చూడాలని హితవు పలికారు. అక్రమ అరెస్టులు, కక్షసాధింపు చర్యలకు పాల్పడకుండా అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఇక్కడి రిజర్వాయర్లు ఇంతకు ముందు జూన్‌లో నిండి జూలైలో కాలువలకు నీరు వదిలేదని, ప్రస్తుతం ఎండిపోయే పరిస్థితుల్లో ఉన్నందున రైతుల సమస్యల్ని గుర్తించి పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మారపాక రవి, పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్, నాయకులు తాటికొండ సురేష్, చల్లా చందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఎ.కుమార్, ఎ.బాలరాజు, చిరంజీవి, కుంభం కుమార్, మారెపల్లి ప్రసాద్, గుండె మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కమిటీ నియామకం



అనిల్‌కుమార్‌గౌడ్ పార్టీ పట్టణ అధ్యక్షుడు

జనగామ: జిల్లాలో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు నూతన కమిటీని నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి తెలిపారు. గురువారం ఆయన అధ్యక్షతన కమిటీ నియామకం జరిగింది. ఉపాధ్యక్షులుగా దొంగరి మహేందర్, బేజాటి బీరప్ప, సోమిడి వెంకట్‌రెడ్డి, దేవరాయ ఎల్లయ్య, మార్క ఉపేందర్, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.శివరాజ్‌యాదవ్, సౌడ రమేష్, దుబ్బ రాజేశ్వర్, కార్యదర్శులుగా సోమన్న, గట్టు కృష్ణ, ఎస్.భాస్కర్‌రెడ్డి, మంద వెంకన్న, డి.రాజు, మాలతీ రెడ్డి, కోశాధికారిగా మహంకాళి హరిశ్చంద్ర గుప్త, కిసాన్ మోర్చా ప్రతినిధిగా తాళ్లపల్లి శ్రీనివాస్, ఎస్సీ మోర్చా రడపాక ప్రదీప్, మహిళా మోర్చా కత్తుల లక్ష్మి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధులుగా తోకల సంపత్ రెడ్డి, చింత సృజన్, బి.ఆరోగ్యం, వి.వెంకట్, పవన్‌శర్మ, నిరంజన్‌రెడ్డి, సిద్ది సోమిరెడ్డి, గుగులోతు మధు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్‌గౌడ్, నవీన్‌రెడ్డి, జి.సంపత్, బి.సురేష్, దిలీప్, కె.కృష్ణమూర్తి, జనగామ పట్టణ అధ్యక్షుడిగా బొమ్మకంటి అనిల్‌కుమార్ గౌడ్, నర్మెట మండల అధ్యక్షుడిగా రంగు మురళి నియామకమయ్యారు.

చందా వసూలులో గొడవ

కత్తితో దాడి.. ఇరువురికి గాయాలు

నర్మెట: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వాహణ నిమిత్తం చందాల వసూలు విషయంలో ఓ యువకుడు కత్తితో దాడికి పాల్పడగా ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన వెల్దండ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. చందాల వసూలు విషయంలో కంతి స్వామికి గోల్కొండ శ్రీనివాస్‌కు మధ్య వివాదం నెలకొంది. ఈ సందర్భంగా గురువారం జండా ఆవిష్కరణ కార్యక్రమం అనంతరం ఇరువురికి పెద్ద మనుషులు సర్దిచెబుతున్న క్రమంలో శ్రీనివాస్ దుర్భాషలాడుతూ వెళ్లిపోతున్నాడు. ఈ క్రమంలో కంతి స్వామి, అతని సోదరుడు రవి నిలదీయగా శ్రీనివాస్ తనవద్ద ఉన్న కత్తితో ఇరువురి మీద దాడి చేసి గాయపరిచాడు. స్వామికి బలమైన గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఘట్‌కేసర్ నీలిమా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నైనాల నగేష్ తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి

నర్మెట: మండలంలోని గండిరామారం గ్రామానికి చెందిన రైతు అక్కల పోషయ్య(55) పాము కాటుతో మృతి చెందాడు. మేతకు వెళ్లిన తన పాడి గేదెను ఇంటికి తోలుకు రావడానికి గురువారం సాయంత్రం వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో పనిలో నిమగ్నమైన అతడి కాలికి పాముకాటు వేసింది. విషయం గమనించకపోవడంతో కాసేపటికి మృతి చెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

యోధుల అడుగుజాడల్లో నడుద్దాం..

- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న కొమ్మూరి, ప్రభుత్వ విప్ అయిలయ్య

జనగామ: దేశ స్వాతంత్ర్యం కోసం తెల్లదొరలను తరిమి కొట్టేందుకు తమ ప్రాణాలను త్యాగం చేసిన నాటి పోరాట యోధుల అడుగుజాడల్లో ముందుకు నడుద్దామని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని గురువారం డీసీసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ముఖ్యఅతిథిగా హాజరు కాగా.. ఆయనతో కలిసి కొమ్మూరి జాతీయ జెండా ఎగుర వేశారు. అంతకు ముందు అమర వీరులకు నివాళులర్పించారు.

లింగపల్లిలో మద్యపాన నిషేధం

- నిర్ణయించిన గ్రామస్తులు



గ్రామస్తులతో ఎక్సైజ్ సీఐ ప్రభావతి

బచ్చన్నపేట : మండల పరిధి లింగంపల్లిలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు జనగామ ఎక్సైజ్ సీఐ ప్రభావతిని గురువారం గ్రామానికి ఆహ్వానించి ఇందుకు సంబంధించిన నిర్ణయ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో మొక్కలు నాటిన అనంతరం మాట్లాడారు. అన్ని గ్రామాల్లో మద్యపానాన్ని నిషేధించి అందరూ ఆరోగ్యంగా.. ప్రశాంతమైన జీవనం గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల చేత మద్యపాన నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. నేటి నుంచి గ్రామంలో ఎవ్వరూ మద్యం విక్రయించినా చర్యలు తీసుకుంటామని ప్రభావతి స్పష్టం చేశారు. గ్రామస్తులంతా ఇతరులు స్ఫూర్తిగా తీసుకునేలా వ్యవహరించాలని సూచించారు.

ఉత్తములకు ప్రశంస పత్రాలు - 8లో▸

జాతీయ భావం పెంపొందించుకోవాలి

- జిల్లా జడ్జి రవీంద్రశర్మ

జనగామ రూరల్: స్వాతంత్ర్య స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని జిల్లా జడ్జి డి.రవీంద్రశర్మ అన్నారు. గురువారం పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా జిల్లా కోర్టు ఆవరణలో గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని తెలుసుకోవాలని చెప్పారు. ఫండమెంటల్ రైట్స్ గూర్చి ఆలోచిస్తున్నవిధంగానే డ్యూటీస్ తెలుసుకుని ఆచరించాలన్నారు. జాతీయ జెండాను గౌరవించడం, జాతీయ గీతాన్ని ఆలపించడంతో పాటు స్వాతంత్ర్య సరమయోధులను గౌరవించాలని పేర్కొను. అనంతరం పిల్లలకు పెన్నులు, పెన్సిళ్లు, క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్, జూనియర్ సివిల్ జడ్జి సుచరిత, అదనపు సివిల్ జూనియర్ జడ్జి కె.సందీప, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎనగందుల చంద్రరుషి, పీపీ భిక్షపతి, మంచాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు. జెడ్పీ కార్యాలయంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెడ్పీ సీఈఓ, సిబ్బంది పాల్గొన్నారు.



జెండా వందనం అనంతరం జాతీయ గీతం ఆలపిస్తున్న జిల్లా జడ్జి రవీంద్ర శర్మ తదితరులు

మూడో విడతలో రూ.735.27 కోట్లు మాఫీ

హన్మకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడో విడతలో రూ.2 లక్షలలోపు రుణమాఫీ కింద రూ.735,27,34,584 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల్లో రూ.లక్షన్నర లోపు రుణ మాఫీ చేసింది. గురువారం మూడో విడతలో భాగంగా రూ.2 లక్షలలోపు రుణాలు మాఫీ చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 56,704 రుణ ఖాతాల ద్వారా 44,462 కుటుంబాలు రూ.735,27,34,584 రుణమాఫీ పొందనున్నాయి.

రుణమాఫీ వివరాలు(రూ.లలో)

జిల్లా	మాఫీ ఖాతాలు	కుటుంబాలు	మాఫీ రుణం
హనుమకొండ	9,506	7,451	122,39,62,799
జనగామ	11,064	8,759	145,32,74,553
జేఎస్.భూపాలపల్లి	7,670	6,258	103,74,63,683
మహబూబాబాద్	14,253	11,322	187,99,50,153
ములుగు	4,833	3,829	63,29,83,391
వరంగల్	9,378	6,843	112,51,00,005

రక్త దాతకు అవార్డు ప్రదానం



జనగామ: ఆపదలో నేనున్నానంటూ రికార్డు స్థాయిలో 89 సార్లు రక్తదానం చేసిన జనగామ పట్టణం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన సామాజిక సేవా కార్యకర్త మల్లిగారి రాజు ఉత్తమ అవార్డు అందుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో రాజుకు.. కలెక్టర్ రిజ్వాన్ బాషాతో కలిసి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఉత్తమ రక్త దాత అవార్డు, ప్రశంస పత్రాన్ని అందజేశారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



జనగామ పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు

జనగామ: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి.. హత్యకు నిరసనగా గురువారం రాత్రి డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలో కొవ్వత్తులతో ర్యాలీ నిర్వహించారు. నెహ్రూపార్కు నుంచి ఆర్టీసీ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం హత్యకు గురైన డాక్టర్ ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ జలగం విజయ నేతృత్వంలో డాక్టర్లు కరుణాకర్‌రాజు, కల్నల్ మాచర్ల భిక్షప తి, దుర్గాప్రసాద్, ఈశ్వర్‌రెడ్డి, తేజశ్విని, వంశీ, షాబాద్, హర్షలాన్, రాకేష్, జూనియర్ డాక్టర్లు, పలు ఉపాధ్యాయ, టీఎన్‌జీఓ నాయకులు చంద్రశేఖర్, ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాపన్న జయంతి ఉత్సవాల కన్వీనర్‌గా 'వడ్లకొండ'

హన్మకొండ: సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాల కన్వీనర్‌గా బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. హనుమకొండ జిల్లా ముచ్చర్ల గ్రామానికి చెందిన వేణుగోపాల్ గౌడ్ సామాజిక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న క్రమంలో ఉత్సవ కమిటీని నియమించింది. కన్వీనర్‌గా నియమితులైన వేణుగోపాల్ గౌడ్.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.



కుక్కల భయం

పట్టణంలో కుక్కలు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. శునకాలను ఎనిమల్ బర్త్ సెంటర్‌కు తరలిస్తున్నా.. గుంపులు గుంపులుగా తిరుగుతూ జనాన్ని భయపెడుతున్నాయి. నెహ్రూపార్కు ఏరియాలో నిత్యం పదుల సంఖ్యలో కుక్కలు తిరుగుతున్నాయి. ఇక్కడే ప్రైవేట్ పాఠశాలతో పాటు ఏబీవీ జూనియర్ కళాశాల, మూడె బ్యాంకులు, ఇతర వ్యాపార సంస్థలు ఉన్నాయి. ఈ ప్రాంతం నిత్యం జనంతో రద్దీగా ఉంటుంది. విద్యార్థులు, ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పోవాల్సి వస్తోంది. – జనగామ



లిఫ్ట్ కష్టం

కలెక్టరేట్‌లో లిఫ్టు పనిచేయడంలేదు. దీంతో మొదటి, రెండవ అంతస్తులో ఉన్న వివిధ శాఖల కార్యాలయాలకు వెళ్లే అధికారులు, పనుల కోసం వచ్చే ప్రజలు, దివ్యాంగులు మెట్ల మార్గం నుంచి వెళ్లాల్సి వస్తోంది. నిత్యం వారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. కలెక్టరేట్ ప్రారంభమైన తర్వాత లిఫ్టు తరుచూ రిపేరుకు వస్తుండడం, పైకి వెళ్లే క్రమంలో మధ్యలోనే ఆగి పోవడం తలనొప్పిగా మారిపోతోంది. – జనగామ

కరెంట్ ఎప్పుడొస్తుంది సార్ అని అడిగితే..

- విద్యుత్ ఏఈ , సబ్ ఇంజనీర్ బూతుల పర్వం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్

కాశిబుగ్గ: కాశిబుగ్గలో కరెంట్ ఎందుకు పోయింది.. ఎప్పుడోస్తది సార్ అని విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఓ క్యాజువల్ కార్మికుడు ఫోన్‌లో అడగగా 'నీకు నేను సమాధానం చెప్పాలా' అంటూ ఓ సబ్ స్టేషన్ ఏఈ బూతులతో ఫైరయ్యాడు. గురువారం కాశిబుగ్గలో జరిగిన ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. కొత్తపేటకు చెందిన కరుణాకర్‌రెడ్డి ఆరెపల్లి సబ్‌స్టేషన్‌లో క్యాజువల్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. దుస్తులు కొనుగోలు నిమిత్తం కాశిబుగ్గకు రాగా కరెంట్ పోయిందని ఆ షాపు నిర్వాహకులు చెప్పారు. దీంతో కరుణాకర్‌రెడ్డి నేను అడిగి తెలుసుకుంటానని ఫోన్‌లో మిల్స్ కాలనీ సబ్‌స్టేషన్ ఏఈకి కాల్ చేశాడు. దీంతో ఏఈ 'నువ్వు నాకు కాల్ చేస్తావా? కాంట్రాక్ట్ లేబర్‌వి.. నీకు నేను సమాధానం చెప్పాలా' అంటూ బూతులు తిట్టాడు. దీంతో కరుణాకర్‌రెడ్డి కూడా ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ విషయం ఏఈ.. గొర్రెకుంటలోని సబ్ ఇంజనీర్‌కు చెప్పడంతో ఆయన, ఏఈ.. మళ్లీ కరుణాకర్‌రెడ్డికి ఫోన్ చేసి ఓ అధికారితో అలా మాట్లాడుతావా అంటూ ఫోన్‌లో బూతులు తిడుతూ బెదిరింపులకు దిగారు. దీనికి కరుణాకర్‌రెడ్డి నేను కరెంట్ విషయం గురించి అడిగితే అధికారి బూతులు తిడతారా? సామాన్యులకు సమాధానం చెప్పరా అంటూ వాగ్వాదం చేశారు. దీనికి ఏఈ, సబ్ ఇంజనీర్ నువ్వు ఎక్కడ ఉన్నావో చెప్పు నీ అంతు చూస్తామని బెదిరింపులకు దిగిన మాటలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈఘటన బయటకు రావడంతో నగరవాసులు కూడా తాము కరెంట్ వాళ్లకు ఫోన్ చేస్తే సరిగా సమాధానం చెప్పడం లేదని పేర్కొంటున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.



విప్ అయిలయ్య నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న జనగామ ఆర్డీఓ కొమురయ్య

ఉత్తములకు ప్రశంస పత్రాలు

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో గురువారం వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, సిబ్బందికి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, డీసీపీ రాజమహేంద్రనాయక్, అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్‌తో కలిసి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రశంస పత్రాలు అందజేశారు.

– జనగామ



డీఎస్.వెంకన్న ఆర్డీఓ, ఘన్‌పూర్ | పి.నర్సింహారెడ్డి ట్రెజరీ అధికారి | వేణుమాధవ్ ఎస్ఈ, జనగామ | మధుసూదన్‌రెడ్డి ఎంసీహెచ్



వినోద్‌కుమార్ డీఏఓ, జనగామ | మనోహర్ పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి | జయంతి డీడబ్ల్యూఓ | శ్రీధర్, లీడ్ బ్యాంకు మేనేజర్ | మన్సూరి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ | మనోజ్ కలెక్టర్ సీసీ | రోజారాణి డీఎస్ఓ | రాజనర్సయ్య, ఎస్ఏ ఆర్డీఓ, జనగామ | ఎం.వెంకన్న తహసీల్దార్ | బి.యుగంధర్ తహసీల్దార్ | అన్వేష్ గిర్దావర్ జనగామ | ఇ.వెంకటేశ్వర్లు తహసీల్దార్



బి.హరిప్రసాద్, నాయబ్ తహసీల్దార్ | భీంశర్మ ఏసీపీ ఘన్‌పూర్ | ఏ.నర్సయ్య ఏసీపీ, వర్ధన్నపేట | ఎం.రాజేందర్ ఎస్సై ఘన్‌పూర్ | ఎం.భరత్ ఎస్సై, జనగామ | కె.శ్రీధర్, ఎస్సై, టాస్క్‌ఫోర్స్ | శ్రీనివాస్, ఆర్ఎస్సై పరేడ్ కమాండెంట్ | చంద్రశేఖర్ ఆర్ఎస్సై | ప్రభాకర్, హెచ్‌సీ, ఇంటెలిజెన్స్ | శంకర్ డీటీ నర్మెట | రాజశ్రీ జేఏ, నర్మెట | డాక్టర్ శ్రీనివాస్ సీహెచ్‌సీ




డాక్టర్ శకుంతల గైనకాలజిస్టు | కె.రాజేశ్ ల్యాబ్ టెక్నీషియన్ | కె.నరేందర్ శానిటేషన్ సూపర్‌వైజర్ | ఎండీ.అబ్దుల్, ఎంసీ సూపరింటెండెంట్ | సీహెచ్.వెంకటేశ్వర్లు ఏఓ, ఘన్‌పూర్ | రాజ్‌కుమార్ ఎన్పీడీసీఎల్, ఏఈ | గౌసియాబేగం జెండర్ కోఆర్డినేటర్ | కె.పవన్‌బాబు, డీఈఓ, ఎస్ఏ | కె.పద్మ, ఎక్సైజ్ ఎస్సై, దేవరుప్పుల | ఎల్.మధుకర్‌రెడ్డి ఎక్సైజ్ శాఖ జేఏ | డీవీఎస్.శర్మ అర్చకుడు, పాలకుర్తి | కొండల్‌రెడ్డి ఎఫ్ఆర్ఓ, జనగామ

ఇ.శ్రీనివాస్, డీటీ సివిల్ సప్లయీస్



ఎన్.మాధవీలత ప్రిన్సిపాల్ | జహీదాబేగం ఉర్దూ ఆఫీసర్ | రామానందగిరి ఎస్ఏ, ట్రెజరీ | సతీశ్ రాం, జేఏ, ట్రాన్స్‌పోర్టు ఆఫీస్ | డి.ఫ్లోరెన్స్ సీడీపీఓ, ఘన్‌పూర్ | కె.అనిత, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, ఏడీ మైన్స్ | షహీనా సుల్తానా కమ్యూనిటీ ఆర్గనైజర్ | బి.శ్రీనివాస్ సూపర్‌వైజర్, ఏఎంసీ | శ్రీనివాస్ అంబులెన్స్ జిల్లా మేనేజర్ | సదానందం ఏఎస్సై, దేవరుప్పుల | ఎం.ముత్తయ్య, టీఐ3, ఆర్టీసీ డిపో



మేలిమి ఆశ చూపి.. నకిలీ బంగారం అంటగట్టి

- డబ్బులు దండుకుని ఉడాయించిన వ్యక్తులకు దేహశుద్ధి
- పోలీసులకు అప్పగింత



ఉడాయించిన ఇద్దరిని (కూర్చున్న వారు) ప్రశ్నిస్తున్న బాధితుడు

బయ్యారం: మాయమాటలతో మేలిమి చూపి..ఆ తరువాత నకిలీ బంగారం కుదవపెట్టి డబ్బులు తీసుకున్న ఇద్దరు వ్యక్తులకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం బయ్యారంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కురవి మండలం రాజోలుకు చెందిన కలకోటి రాము అదే గ్రామంలో బాలా జీ సూపర్‌మార్కెట్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మూడునెలల క్రితం రాజస్తాన్‌కు చెందిన గణేశ్, క్రాంతిలాల్, తదితరులు సూపర్‌మార్కెట్‌కు వెళ్లి సరుకులు కొనుగోలు చేశారు. ఈ సమయంలో తమకు బంగారం గొలుసు దొరికిందని రాముకు చెప్పి గొలుసులోని చిన్న ముక్క ఇవ్వగా అతను మహబూబాబాద్‌లో నాణ్యత పరీక్షించుకుని బంగారంగా నిర్ధారించుకున్నాడు. ఆ తరువాత కొన్ని రోజులకు గొలుసుతో రాము వద్దకు వచ్చిన రాజస్తాన్ వాసులు తమకు డబ్బులు అవసరం ఉన్నాయని, రూ. రెండు లక్షలు ఇస్తే సుమారు 8 తులాల బంగారం గొలుసు ఇస్తామని చెప్పారు. దీంతో రాము వారికి డబ్బులు ఇచ్చి గొలుసు తీసుకున్నాడు. అనంతరం గొలుసును ముత్తూట్ ఫైనాన్స్‌లో తనఖా పెట్టి డబ్బులు తీసుకుందామని రాము మహబూబాబాద్ వెళ్లగా అక్కడ పరీక్షించిన నిర్వాహకులు నకిలీ బంగారంగా గుర్తించారు. దీంతో రాము తనకు చిన్న బంగారం వస్తువు అందించి నకిలీ గొలుసు ఇచ్చి మోసగించిన ట్లు గుర్తించి వారి ఆచూకీ కోసం గాలిస్తున్నాడు. ఈ క్రమంలో బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో గణేశ్, క్రాంతిలాల్ సంచరిస్తున్నట్లు సమాచారం తెలుసుకుని వారిని పట్టుకున్నారు. ఈ సమయంలో కొందరు వ్యక్తులు వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

వరంగల్ రీజియన్‌ను అగ్రగామిగా నిలపాలి

- ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను

హన్మకొండ: లాభాల్లో వరంగల్ రీజియన్‌ను అగ్రగామిగా నిలపాలని ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం డి.విజయభాను అన్నారు. గురువారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణంతో బస్సుల్లో రద్దీ పెరిగిందన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి ఉద్యోగులు కష్టపడుతున్నారన్నారు. ప్రయాణికుల ఆదరాభిమానాలు చూరగొంటూ కార్పొరేషన్‌లో వరంగల్ రీజియన్‌ను ఆదాయంలో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. వరంగల్–2 డిపో అసిస్టెంట్ మేనేజర్ జ్యోత్స్న, అసిస్టెంట్ మెకానికల్ ఈ.అమల, వరంగల్–2 డ్రైవర్ బి.వెంకన్న, వరంగల్–1 డిపో డ్రైవర్ ఎ.రమేశ్, మహబూబాబాద్ డ్రైవర్ వి.శ్రీనివాస్, హనుమకొండ డిపో కండక్టర్ జి.సరళాదేవి, మెకానిక్ జి.దేవేందర్‌కు ప్రశంస పత్రాలు అందించారు. డిప్యూటీ ఆర్ఎంలు కె.భానుకిరణ్, జి.మాధవరావు, అకౌంట్స్ ఆఫీసర్ ఎ.రవీందర్, పర్సనల్ ఆఫీసర్ రామ్మోహన్ రావు, ఈఈ భాస్కర్ పాల్గొన్నారు.



జాతీయ పతాకం ఆవిష్కరించి మాట్లాడుతున్న ఆర్ఎం డి.విజయభాను

ప్రాణాపాయం నుంచి గట్టెక్కారు..

- కారు డోర్ లాక్..వాహనంలోనే చిన్నారులు
- అర్ధగంటకు పైగా భయానక వాతావరణం
- మెకానిక్ సాయంతో తెరుచుకున్న డోర్‌లు
- ఊపిరిపీల్చుకున్న తల్లిదండ్రులు

హన్మకొండ అర్బన్: తల్లిదండ్రులు తమ ఇద్దరు చిన్నారులను కారులో వదిలి మందుల కొనుగోలు నిమిత్తం మెడికల్ షాపునకు వెళ్లారు. అనుహ్యంగా కారు డోర్ లాక్ అయింది. దీంతో అర్ధగంటకు పైగా భయానక వాతావరణం నెలకొంది. కొత్తూరు జెండాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రీకాంత్, శ్రావణి దంపతులు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను తిలకించడానికి గురువారం కారులో పుర వీధుల్లోకి వచ్చారు. జెండా వందనాలు చూసిన అనంతరం సుబేదారిలోని 'ఏ టు జెడ్' మెడికల్ షాపులో మందులు కొనడం కోసం కారులో నుంచి దిగారు. ఆ సమయంలో కారులో ఉన్న తాళంతో పిల్లలు డోర్ లాక్ చేశారు. బయటకు వచ్చిన తల్లిదండ్రులు కారు డోర్ తెరవడానికి యత్నించి విఫలమయ్యారు. లోపల ఉన్న పిల్లలకు ఊపిరి తీసుకోవడం కష్టమవుతుందని ఆందోళన చెంది వెంటనే మెకానిక్‌కు ఫోన్ చేస్తూ స్థానికుల సహకారంతో కారు డోర్ తెరవడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ క్రమంలో అర్ధగంట తర్వాత మెకానిక్ వచ్చి కారు డోర్‌లు తెరవడంతో పిల్లలు బయటకు వచ్చారు. దీంతో చూపరులతో పాటు తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.



సుబేదారిలో కారులో ఉన్న ఇద్దరు పిల్లలను బయటకు తీస్తున్న స్థానికులు

పోడుకు యత్నించిన ఇద్దరిపై కేసు నమోదు

భూపాలపల్లి : అటవీ భూమిని నరికి పోడు చేసేందుకు యత్నించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు అటవీశాఖ భూపాలపల్లి రేంజ్ ఆఫీసర్ బన్న నరేశ్ తెలిపారు. ఎఫ్ఆర్ఓ కథనం ప్రకారం.. రాంపూర్ నార్త్ 4వ బీట్‌లోని రక్షిత అటవీ ప్రాంతంలో ఒకరు చెట్లు నరుకుతున్నట్లు గురువారం సమాచారం అందింది. ఈ మేరకు ఘటనా స్థలికి చేరుకుని చెట్లు నరుకుతున్న సింగరవేణి నరేందర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడిని విచారించగా తాను కూలీ పని నిమిత్తం వచ్చానని, సింగరేణి భూపాలపల్లి ఏరియాలో పని చేసే టి. రఘోత్తంరెడ్డి 20 ఎకరాల భూమి చదును చేసేందుకు రూ. 40 వేలు ఇస్తానని చెప్పినట్లు తెలిపాడన్నారు. దీంతో రఘోత్తంరెడ్డిని కూడా అదుపులోకి తీసుకుని విచారించగా, తాను నాగారం చెందిన మధ్యవర్తుల ద్వారా ఆ భూమిని కొనుగోలు చేశానని వెల్లడించారన్నారు. దీంతో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్ఓ వెల్లడించారు. అటవీ భూమిని ఎవరూ కొనుగోలు చేసి మోసపోవద్దని, అడవిలో చెట్లు నరికినా, పోడుకు ప్రయత్నించినా చర్యలు తప్పవని ఎఫ్ఆర్ఓ నరేశ్ హెచ్చరించారు.

ఇంటి భోజనానికి..

భారత సర్కారు గుర్తింపు

నర్సంపేటలోని ఉప్పలయ్య హోటల్‌కు జాతీయ ప్రశంస



నర్సంపేట పట్టణంలోని ఉప్పలయ్య హోటల్



ఉప్పలయ్య హోటల్‌కు వచ్చిన సర్టిఫికెట్

నర్సంపేట: ఫైవ్ స్టార్ హోటళ్లు ఎన్ని ఉన్నా.. రుచికరమైన ఇంటి భోజనం ఎక్కడ దొరికితే అక్కడికి భోజన ప్రియులు పరుగెత్తుతారు. అటువంటి ఇంటి భోజనం లభిస్తున్న ఓ చిన్న హోటల్‌కు భారత సర్కారు గుర్తింపు లభించింది. ఇప్పుడు ఆ హోటల్ పేరు సామాజిక మాధ్యమాల్లో మార్మోగుతోంది. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో ముప్పై సంవత్సరాల క్రితం ఉప్పలయ్య తన ఇంట్లోనే (ఉప్పలయ్య హోటల్) మెస్‌ను ప్రారంభించారు. తక్కువ ధరకే ఇంటి భోజనాన్ని అందించడంతో భోజన ప్రియులు విపరీతంగా వచ్చేవారు. కొంతకాలం తరువాత ఉప్పలయ్య అనారోగ్యంతో చనిపోయారు. ఆ తర్వాత హోటల్‌ను తన కుమారుడు శ్రీనివాస్ కుటుంబ సభ్యులు నడిపిస్తూ వస్తున్నారు. కుటుంబ సభ్యులు మొత్తం హోటల్ నిర్వహణ చూసుకుంటున్నారు. రుచిలో ఏ మాత్రం తేడా రాకుండా తన తండ్రి ఏ విధంగా లాభాపేక్ష లేకుండా నడిపించాడో కుమారుడు శ్రీనివాస్ కూడా అలాగే నడిపిస్తున్నాడు. ఈ హోటల్‌కు రోజూ సుమారు 200మందికిపైగా వచ్చి భోజనం చేస్తున్నారంటే రుచి ఎలా ఉంటుందో మనం అర్థం చేసుకోవచ్చు.

జాతీయ గుర్తింపు ఎలా వచ్చిందంటే..

ఈ హోటల్‌లో వెజ్, నాన్‌వెజ్ తక్కువ ధరలో అందిస్తున్నారు. వినియోగదారుడి ధరకు అందుబాటులో ఉండేలా నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలుసుకున్న భారత ప్రభుత్వం(మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్) నుంచి రీజనల్ హెడ్ ఆఫీస్ హైదరాబాద్ సభ్యులు రెండు నెలల కిందట ఈ హోటల్‌కు వచ్చి భోజనం చేసి బాగుందని చెప్పి వెళ్లిపోయారు. ఈ నెల 12(సోమవారం)న మరోసారి హోటల్‌కు వచ్చి మీ హోటల్‌కు అవార్డు వచ్చిందని చెప్పి శ్రీనివాస్‌కు సర్టిఫికెట్ అందజేశారు. ఇదే నాణ్యతను కొనసాగిస్తూ భోజన ప్రియులకు నాణ్యమైన, రుచికర భోజనాన్ని అందించాలని అభినందించారు.

మంచి పేరు కోసమే..



హోటల్ పెట్టినప్పటినుంచి మా ఇంట్లోనే భోజనాలు ఏర్పాటు చేసేవాళ్లం. నాణ్యతతోపాటు తక్కువ ధరలకు భోజనం అందిస్తూ వచ్చాం. హోటల్‌కు వచ్చే వాళ్లకు మంచి రుచితో కూడిన భోజనాలు అందించాలని మా నాన్న ఉప్పలయ్య చెప్పేవారు. ఆయన అదే విధంగా చాలా సంవత్సరాలు నడిపించారు. నాన్న చూపిన బాటలోనే హోటల్‌ను నడిపిస్తున్నాం. దీని ద్వారానే జాతీయ స్థాయి అవార్డు లభించింది..పెద్ద పెద్ద హోటళ్లకు దక్కని అవార్డు మా హోటల్‌కు లభించడం సంతోషకరంగా ఉంది.

– జల్ల శ్రీనివాస్, ఉప్పలయ్య హోటల్ నిర్వాహకుడు, నర్సంపేట

తన వద్దకు అమ్మమ్మ రావడం లేదని..

- మనస్తాపంతో యువతి ఆత్మహత్య
- భీమదేవరపల్లిలో ఘటన



నిఖిత మృతదేహం

ఎల్కతుర్తి: తన వద్దకు అమ్మమ్మ రావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం భీమదేవరపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మారుపాటి నిఖిత(22) కేయూలో పీజీ చదువుతుంది. నిఖితకు అమ్మమ్మ అంటే చాలా ఇష్టం. ఈ క్రమంలో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిర్సపల్లికి చెందిన నిఖిత అమ్మమ్మ కొంతకాలంగా నిఖిత ఇంటికి రావడం లేదు. ఈ ఘటనపై అమ్మమ్మ ఇంటికి ఎందుకు రావడం లేదని కుటుంబీకులను అడుగుతూ బాధపడుతుండేది. ఈ క్రమంలో ఈనెల 14న పరీక్ష రాసేందుకు వెళ్లిన నిఖిత. సాయంత్రం ఇంటికి చేరుకుంది. రాత్రి తండ్రి మహేందర్‌రెడ్డి, తల్లి సుమతి, అక్క ప్రియదర్శినితో కలిసి భోజనం చేసిన అనంతరం నిద్రించడానికి తన రూమ్‌లోకి వెళ్లింది. తెల్లారినా నిఖిత నిద్ర నుంచి లేవక పోవడంతో తండ్రి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో రూమ్‌కు వెళ్లి తలుపు కొట్టగా ఎంతకూ తీయలేదు. మహేందర్ రెడ్డి తన స్నేహితుడితో కలిసి బలవంతంగా తలుపు తీయగా నిఖిత ఉరేసుకుని కనిపించింది. ఈ ఘటనపై మహేందర్‌రెడ్డి ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్.. మహేందర్‌రెడ్డి ఇంటికి చేరుకుని కుటుంబీకులను ఓదార్చారు.

కుటుంబ కలహాలతో యువకుడు..

చిల్పూరు: కుటుంబ కలహాలతో మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కలకోళ వెంకటేశ్(36) హైదరాబాద్‌లోని ఇంట్లో గురువారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్ మృతితో కుటుంబంతోపాటు కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య జ్యోతి, ముగ్గురు కుమారులు ఉన్నారు.